సాక్షి ప్రకాశం

సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



మహనీయుడు అంబేడ్కర్

అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. - 8లో..



టీడీపీని ఛీకొట్టి.. సంక్షేమానికి జైకొట్టి

జిల్లావ్యాప్తంగా ఆదివారం వందలాది మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల సమక్షంలో వైఎస్సార్ సీపీ కండువాలు కప్పుకున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
39/26

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వేడి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

16న జూనియర్ బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక ఈనెల 16న కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సోమినేని సురేష్, తొట్టెంపూడి సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిక ప్రారంభమవుతుందన్నారు. 2006 జూన్ 1వ తేదీ తరువాత జన్మించిన వారు మాత్రమే అర్హులు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 9866126955 లేదా 9849429839 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీయటానికే స్లాస్



శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో సుభద్ర

ఒంగోలు సెంట్రల్: విద్యార్థుల సామర్థ్యాలను వెలికి తీయటానికే స్టేట్ లెవల్ అచీవ్‌మెంట్ సర్వే (స్లాస్) పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో డీ సుభద్ర అన్నారు. స్లాస్ పరీక్ష నిర్వహణపై డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం ఇన్విజిలేటర్స్‌కు, సీఆర్పీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఈఈబీ సెక్రటరీ వై వెంకట రావు మాట్లాడుతూ 16న జరిగే స్లాస్ టెస్ట్‌లో జిల్లాలోని 123 పాఠశాల్లో 3843 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.

అ'సామాన్యుడు' చెవిరెడ్డి



రోడ్డుపక్కన హోటల్‌లో టిఫిన్ చేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి

మార్కాపురం: ఒంగోలు పార్లమెంట్ నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి..ప్రస్తుతం చంద్రగిరి ఎమ్మెల్యే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన అత్యంత సన్నిహితుడు. లక్షలాదిమంది ప్రజల అభిమానాన్ని చూరగొన్న నేత... ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో గడిపే స్థాయి ఉన్నప్పటికీ అతి సామాన్య కార్యకర్తలాగా రోడ్డుపక్కన హోటల్‌లో టిఫిన్ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన ప్రచారం చేస్తూ దేవరాజుగట్టు వద్ద ఓ హోటల్‌లోనికి సాధారణ వ్యక్తిలాగా వెళ్లి టిఫిన్ చేశారు. హోటల్‌కు వచ్చిన కొంతమంది చెవిరెడ్డిని చూసి ఆశ్చర్యపోయారు. ఓ సాధారణ కార్యకర్తలాగా అందరితో కలిసిపోవడాన్ని చూసి నాయకుడంటే ఇలా ఉండాలంటూ వ్యాఖ్యానించారు.

దాడి కుట్రే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో దాడి జరగడంపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. వైఎస్సార్ సీపీ శ్రేణులు నల్లబ్యాడ్జీలతో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాయి. అంబేడ్కర్ విగ్రహాల వద్ద తమ ఆందోళన వ్యక్తం చేశాయి. సీఎం జగన్‌పై కుట్రపూరితంగానే దాడి జరిగిందని.. దాని వెనుక టీడీపీ హస్తం ఉందని ఆరోపించాయి. దాడిచేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి.

- సీఎం జగన్‌పై దాడికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు
- టీడీపీ చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అన్న ఎమ్మెల్యే బాలినేని
- చంద్రబాబే ప్రధాన కుట్రదారుడన్న మంత్రి మేరుగు నాగార్జున
- అత్యున్నత సంస్థతో విచారణ జరిపించాలన్న మంత్రి సురేష్



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన మేయర్ గంగాడ సుజాత

సాక్షి నెట్‌వర్క్:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై శనివారం రాత్రి విజయవాడలో జరిగిన దాడికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కార్యాలయాల వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఒక సీఎంపై దాడి చేయాలంటే పెద్ద గట్స్ కావాలని, అందుకు నిందితుల వెనుక పెద్దల హస్తం తప్పక ఉండి ఉంటుందన్నారు. టీడీపీ వాళ్లు కూడా మీటింగ్‌లు పెట్టరా, ఇదే దాడి చంద్రబాబు మీద జరిగితే ఊరుకుంటారా అంటూ ప్రశ్నించారు. ఇంత జరిగినా సీఎం శాంతంగా ఉండాలంటూ పిలుపునివ్వడాన్ని ప్రజలు గమనించాలన్నారు. టీడీపీ చర్యలు ప్రతిచోట ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారుతున్నాయన్నారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు ప్రజాస్వామిక వాదులు ఎవరైనా దాడిని ఖండించాలని, అంతే తప్ప అపహాస్యం చేయడం సరికాదన్నారు. ఇటీవల వస్తున్న సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం అని తేలడంతో పార్టీ క్యాడర్‌ను రెచ్చగొడుతూ చంద్రబాబు అండ్ కో ప్రజాస్వామ్య విధానాలకు గండి కొడుతున్నారన్నారు. ఈనెల 10న ఒంగోలులో జరిగిన ఘటన కూడా అందులో భాగమే అని, నా కోడలితోపాటు మా పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడి చేయడంతోపాటు అసభ్య పదజాలంతో దూషించారన్నారు. నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ మాదాసు వెంకయ్య, మహిళా విభాగం జోనల్, నగర అధ్యక్షుడు బడుగు ఇందిర, చింతగుంట్ల సువర్ణ, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బొట్ల సుబ్బారావు, మేదర కార్పొరేషన్ చైర్మన్ కేతా లలిత నాంచారమ్మ, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పత్రా బంగారం, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు పసుమర్తి గోపీచంద్, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, సేవాదళ్ నగర అధ్యక్షుడు వల్లెపు మురళి, వీరాంజనేయస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి ఆంజనేయరెడ్డి, మాతా శిశు వైద్యశాల డైరెక్టర్ సాధం విజయలక్ష్మి, నాగూరు, మీరావలి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ జాని, క్లస్టర్ ఇన్‌చార్జి రాయపాటి అంకయ్య, చీమకుర్తి టౌన్ అధ్యక్షుడు క్రిస్టిపాటి శేఖర్‌రెడ్డి, రావులపల్లి ధనలక్ష్మి యాదవ్, దామరాజు క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కంభంలో నల్లబ్యాడ్జీతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



నల్లబ్యాడ్జిలతో నిరసనలో దద్దాల నారాయణ యాదవ్, పార్టీ నేతలు

- సీఎంపై దాడి హేయమైన చర్య అని గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. సీఎంపై జరిగిన దాడిని ఖండిస్తూ ఆదివారం కంభంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వేగవంతంగా విచారణ జరిపి నిందితులను శిక్షించాలన్నారు. కార్యక్రమంలో చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, నెమలిదిన్నె చెన్నారెడ్డి, సయ్యద్ జాకీర్ హుస్సేన్, చేగిరెడ్డి పోతిరెడ్డి, నన్నెబోయిన రవికుమార్, మహబూబ్ పీరా, గొంగటి చెన్నారెడ్డి, ఆనంద్, జాకీర్, రసూల్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన:



నల్లబ్యాడ్జీలతో మౌన ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నా, షంషేర్ అలీబేగ్ తదితరులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. స్థానిక కోర్టు సెంటరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి మౌన ప్రదర్శన చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాంబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేక దొంగచాటుగా ఇలాంటి కుట్రలు చేయడం ప్రజాస్వామ్యంలో మంచిపద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్‌తోపాటు ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, గుంటక వెంకటరెడ్డి, శ్రీశైలం దేవస్థాన ట్రస్టుబోర్డు సభ్యురాలు డాక్టర్ కనకదుర్గ, షెక్షావలి, బూదాల సతీష్, కొండారెడ్డి, శ్రీనివాసులు, రోజ్‌లిడియా, సిరాజ్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

- సభ్యసమాజం తల దించుకునేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి జరిగిందని జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పై దాడిని ఖండించారు.



సీఎం చిత్రపటంతో నిరసన తెలుపుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి హేయమైందని, దాడిపై అత్యున్నత దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని మంత్రి, కొండపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సీఎం జగన్ గాయపడిన చిత్రపటాలను పట్టుకుని తన నిరసన తెలియజేశారు. హత్యా రాజకీయాలను ఎవరూ సహించరని, ప్రజాస్వామ్యానికి ఇవి గొడ్డలిపెట్టు అన్నారు. నిరసన కార్యక్రమంలో పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్ రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, తన్నీరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- సీఎం జగన్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే చంద్రబాబు కూటమి కుట్రలకు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై దాడిని ఖండిస్తూ స్థానిక పార్టీ కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై దాడికి నిరసనగా జాతీయ రహదారిపై ధర్నా



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

సీఎం వైఎస్ జగన్‌పై రాళ్లదాడి సంఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సంఘటనకు నిరసనగా శనివారం రాత్రి 11 గంటలకు మార్కాపురం-కంభం జాతీయ రహదారిపై ఉన్న చింతగుంట్ల గ్రామం వద్ద ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ ఐడీసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు ధర్నా చేశారు. అర్ధరాత్రి ప్రజలు స్వచ్ఛందంగా బయటకు వచ్చి నిరసనలో పాల్గొన్నారు. దీంతో జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ధర్నాలో ఏఎంసీ డైరెక్టర్లు పీఎల్‌పీ యాదవ్, డాక్టర్ మక్బూల్ బాష, ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్టారెడ్డి, కుందూరు వెంకటరెడ్డి వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్. కొండయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల బంగారు భవిష్యత్తుపై దాడి: మంత్రి మేరుగు నాగార్జున



చీమకుర్తి మెయిన్‌రోడ్డులో ర్యాలీగా వస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

రాష్ట్ర ప్రజల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక వచ్చే ఎన్నికల్లో గెలవలేమనే ఆందోళనతోనే దాడికి పాల్పడ్డారని, దాడిలో చంద్రబాబునాయుడే ప్రధాన కుట్రదారుడని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆదివారం చీమకుర్తి పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీ నుంచి పోలీస్ స్టేషన్ వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన నిరసన ర్యాలీలో మంత్రి మేరుగు నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుకు అనుకూలంగా పచ్చమీడియా అండదండలతో సీఎంను అంతమొందించాలనే కుట్రతోనే దాడి చేయించారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు బీమన వెంకట్రావు, పాటిబండ్ల గంగయ్య, గంగిరెడ్డి సుందర రామిరెడ్డి, ఆముదాలపల్లి రామబ్రహ్మాం, తప్పెట బాబూరావు, సోమా శేషాద్రి, మంచా హరికృష్ణ, చీదర్ల శేషు పాల్గొన్నారు.

- వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి

మీరు రాయితో కొట్టారు..
జనం ఓటుతో మిమ్మల్ని కొడతారు

యర్రగొండపాలెం: ''జగనన్నకు తగలరాని చోట తగిలి ఉంటే.. కంటికి కాకుండా తలకు తగిలితే ఏమయ్యేది. మీరు రాయితో కొట్టారు. మిమ్మల్ని జనం ఓటుతో కొడతారు జాగ్రత్త. అక్కడ ఉన్నది జగన్ మోహన్‌రెడ్డి. ఇలాంటి వాటికి జడవరు. ఇలాంటి వాటిని ఎన్నో చూశాడు. తట్టుకుని ప్రజల్లోకి వెళతారు. ఒక్కడిని తట్టుకోలేక కూటమిగా అయ్యారు. జనం నుంచి వస్తున్న స్పందన చూసి తట్టుకోలేక దాడులకు పాల్పడుతున్నారు'' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక త్రిపురాంతకం రోడ్డులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వెనక జాకీలు పెట్టుకొని నన్ను లేపండని అంటున్నాడని, రాజకీయాల్లో 40 ఏళ్ల ఇండస్ట్రీ ఉందని చెప్పుకునే ఆయన్ను ఒకరు విజయవాడ, మరొకరు హైదరాబాద్, ఇంకొకరు ఢిల్లీ నుంచి వచ్చి జాకీలు పెట్టి లేపాలని అన్నారు. వైఎస్సార్ సీపీ మీటింగ్ పెడితే దారిపొడువునా ఒకే జెండా కనపడుతుందని, కార్యకర్తలకు ఆ జెండా పట్టుకునే ధైర్యం ఉందని, టీడీపీ వాళ్లు మీటింగ్ పెడితే కరెంట్ పోళ్లు ఎన్ని ఉంటే అన్ని రకాల జెండాలు కనపడతాయని, వాళ్ల దగ్గర ఎరుపు, ఆరెంజ్, పసుపు రంగుల జెండాల ఉన్నాయని, టీడీపీ వాళ్లకు తమ జెండా పట్టుకునే దమ్ము, ధైర్యం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మనమందరం కలిసి పనిచేస్తున్నాం, ఒకే జెండా పట్టుకొని మేము సిద్ధం అని అంటున్నామని అన్నారు. మా నాయకుడు మాట ఇస్తే నిలబడతాడు, హామీ ఇస్తే అమలై తీరుతుందన్నారు. టీడీపీ వాళ్లు తమ నాయకుడు మాట ఇస్తే నిలబడతాడని చెప్పగలిగితే తాను దేనికైనా సిద్ధంగా ఉన్నానని ఛాలెంజ్ చేశారు. వలంటీర్లను ఒకరు పనికిమాలినోళ్లు అని, మరొకరు ఇంటి తలుపులు కొడతాడని, ఇంకొకాయన వీరందరు తీవ్రవాది, జిహాదీలుగా వర్ణించారని, ఎన్నికలు వచ్చే సరికి బాబ్బాబు నీకు పదివేలు జీతం ఇస్తా అని అంటున్నాడని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక గుంపులు గుంపులుగా వస్తున్నారని, ఆయనపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. యువతను ప్రోత్సహించాలని సచివాలయాల్లో 1.50 లక్షల ఉద్యోగాలు కల్పించారని, 2.50 లక్షల మందికి వలంటీరు ఉద్యోగాలు ఇచ్చారని, భవిష్యత్తులో వలంటీరు ఉద్యోగాలు కూడా పర్మినెంట్‌గా కొనసాగించేలా విధంగా జగనన్న ఆలోచిస్తున్నాడన్నారు. తాను 36 సంవత్సరాల నుంచి వైఎస్సార్ కుటుంబంతోనే ఉన్నానని, తనకు మరో పార్టీ అంటే ఏమిటో తెలియదని అన్నారు. కొందరు 5 సంవత్సరాలకు ఒక పార్టీ మారుతున్నారని, పరిస్థితిని బట్టి పార్టీ మారే మనస్తత్వం తనది కాదన్నారు. ఎంపీగా ఆర్థికంగా ఎదిగే వ్యక్తిని కాదని, తాను ఒక కార్యకర్తగా మీ వెంటే ఉంటానని చెప్పారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా తాను రూ.972 కోట్ల నిధులు తీసుకొని వచ్చి 5096 అభివృద్ధి పనులు చేశానని, ఒక్కో పంచాయతీకి రూ.9 కోట్లు ఖర్చుచేశానని అన్నారు. ప్రత్యక్ష రాజకీయాలు తప్ప తనకు మరో ఆలోచనలేదని, పూర్తిగా వెనకబడిన యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో మరో పులివెందులగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు. తమలో ఉన్న వ్యక్తిగత వర్గ, వైషమ్యాలు విడిచి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవటానికి ప్రతి కార్యకర్త కష్టపడాలని, అటువంటి వారికి గుర్తింపు ఉంటుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిగా తాను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తాటిపర్తి చంద్రశేఖర్ పోటీ చేస్తున్నామని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్, నియోజకవర్గ అబ్జర్వర్ వెన్నా హనుమారెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ఐ.వి.సుబ్బారావు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, వివిధ విభాగాల నాయకులు కె.గురుప్రసాద్, సూరె ప్రసాద్, రావూరి సుబ్బారావు, ఆర్.అరుణాబాయి, పి.సరళకుమారి, రాములు నాయక్, కె.సుందర్, జి.కనకారావు పాల్గొన్నారు.



త్రిపురాంతకంలో చెవిరెడ్డి, తాటిపర్తిలకు గజమాలతో ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు

చెవిరెడ్డికి ఘన స్వాగతం

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డికి నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికారు. శనివారం నియోజకవర్గంలోని త్రిపురాంతకం, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లో ఆయన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా మండలాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముందుగా త్రిపురాంతకం చేరారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు భారీ ఎత్తున ర్యాలీ చేశారు. గజమాలతో ఆయనను సన్మానించారు. అక్కడి నుంచి పుల్లలచెరువు చేరిన ఆయనకు నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. యర్రగొండపాలెంలో దాదాపు 2 కిలోమీటర్ల దూరం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. చెవిరెడ్డి మోటారు బైక్‌పై ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌ను ఎక్కించుకొని యువతతో పోటీ పడి వారిని ఉత్తేజపరిచారు. పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున నీరాజనాలు పలికారు.



యర్రగొండపాలెంలో బైక్ ర్యాలీలో చెవిరెడ్డి, తాటిపర్తి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా



బాలినేని, శిద్దా రాఘవరావును సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: ఆర్యవైశ్య సోదరులకు అన్నీ విధాలుగా అండగా ఉంటానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ''ఇప్పటికే 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను, మంత్రిగా పనిచేశాను. ఏనాడూ ఆర్యవైశ్యులను ఇబ్బంది పెట్టలేదు. వారు అడిగింది కాదనలేదు. ఇప్పుడు కూడా ఓట్లేసి మంచి మెజారిటీతో గెలిపించండి. మరిన్ని సేవలు చేస్తా..మీ రుణం తీర్చుకుంటానని'' బాలినేని చెప్పారు. నగరంలోని రంగుతోట క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన 12వ డివిజన్ ఆర్యవైశ్య సోదరుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎవరు ఏ రాజకీయపార్టీ అనేది చూడకుండా ప్రతి ఒక్కరికీ సేవ చేసానన్నారు. ఈసారి గెలిస్తే ప్రతి రోజు 10 మంది ఆర్యవైశ్యులకు తిరుపతి దర్శనం చేసుకునేలా ఏర్పాటు చేస్తానని చెప్పారు. నిరుపేద ఆర్యవైశ్యుల ఇళ్లలో ఎవరైనా చనిపోయినప్పుడు ఇంటి యజమానితో సమస్యలు వస్తున్నాయని, అందుకోసం తమకు ఆరామక్షేత్రం కావాలని అడిగిన వెంటనే నగరం నడిగొడ్డున స్థలం ఏర్పాటు చేయడమే కాకుండా దానికి ప్రభుత్వ పరంగా అవసరమైన అన్నీ రకాల అనుమతులు ఇప్పించినట్లు చెప్పారు. అలాగే 20 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోకుండా ఇబ్బంది పెడుతున్న గోశాల సమస్యను కూడా పరిష్కరించామన్నారు. పెద్దలు కొణిజేటి రోశయ్య మంత్రివర్గంలో తాను మంత్రిగా పనిచేశానని, ఆయన చనిపోయినప్పుడు ఒంగోలులో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ప్రకటించానని, ఇపుడు బాపూజీ కాంప్లెక్స్ ఎదురుగా విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఆ మధ్య బాపూజీ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదంలో నష్టపోయిన ఆర్యవైశ్య సోదరుడికి సొంత నిధుల నుంచి రూ.10 లక్షలు అందజేసినట్లు తెలిపారు. ఇలా ఆర్యవైశ్య సోదరులకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా నిలుస్తున్నానని, ముమ్ముందు కూడా ఎలాంటి సమస్యలు రాకుండా చేస్తానని చెప్పారు. మీకు చేసిన సేవలను గుర్తుంచుకోండి, మరోసారి నన్ను ఆశీర్వదించండి. మీ రుణం తీర్చుకుంటాను అన్నారు. శిద్దా రాఘవరావుకు ఎన్నికల తరువాత సముచిత స్థానం కల్పించనున్నట్లు తెలిపారు. ఆయన సేవలను కూడా అన్నీ విధాలుగా సద్వినియోగం చేసుకుంటామన్నారు. నిరుపేద ఆర్యవైశ్యులకు ఇళ్ల స్థలాల పట్టాలను ఇచ్చామని, ఎన్నికల తరువాత వారిక ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శిద్దా రాఘవరావు మాట్లాడుతూ బాలినేని ఎవరినీ ఇబ్బంది పెట్టే మనస్తత్వం కలిగిన నాయకుడు కాదని, చాలా సౌమ్యుడని, నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులందరూ ఆయనను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలోనే తాను ప్రత్యేకంగా కలుస్తానని, అందరం కలిసి బాలినేనిని గెలిపించుకుందామని చెప్పారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్, ఆర్యవైశ్య నాయకులు తడపర్తి వాసు, మునగా కృష్ణారావు, కోడూరి సత్యనారాయణ, తాతా మధు, గుర్రం ఆదినారాయణ, గుర్రం కొండయ్య, యానాది శెట్టి, శిద్దా సూర్య ప్రకాశరావు, పవన్, భాస్కర్, శ్రీను, వెంకటస్వామి కార్పొరేటర్ కిరణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వే స్టేషన్‌లో రూ.7 లక్షలు స్వాధీనం

ఒంగోలు టౌన్: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.7 లక్షలను ఒంగోలు రైల్వే సర్కిల్ ఎన్ఫోర్స్‌మెంట్ టీం స్వాధీనం చేసుకుంది. కావలి వీఆర్వో గోపాల్ భార్య పెసల పద్మ, పెసల నిఖిల్ కుమార్ శనివారం రాత్రి కావలి నుంచి ఒంగోలు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. తనిఖీలో వీరి వద్ద రూ.7 లక్షలు గుర్తించామని, ఎలాంటి రశీదులు లేకపోవడంతో సీజ్ చేశామని సీఐ ఎస్.శ్రీకాంత్ తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగా.. టీడీపీ కార్యకర్తా?


అశోక్‌రెడ్డితో ఎంపీఈఓ నాగార్జున (వృత్తంలోని వ్యక్తి)

కొమరోలు: గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి శనివారం కొమరోలు మండలం దద్దవాడ పంచాయతీ పరిధిలోని అక్కపల్లెలో పర్యటించగా మర్రిపూడి మండలంలో ఎంపీఈఓగా విధులు నిర్వహిస్తున్న సూర్యబోయిన నాగార్జున కలిసి మద్దతు తెలిపాడు. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయడమే కాకుండా ఫొటోను వాట్సప్ స్టేటస్‌గా కూడా పెట్టుకున్నాడు. సంబంధిత అధికారులు స్పందించి ఎంపీఈఓపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రాచర్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని యడవల్లి హైవే క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు.. గిద్దలూరు మండలం ఉయ్యాలవాడకు చెందిన షేక్ ఖాజావలి(43) గిద్దలూరు నుంచి బేస్తవారిపేట వేళ్లే హైవేపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని రాచర్ల ఎస్సై వి.హరిబాబు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో జంగంగుంట్ల విద్యార్థిని ఆత్మహత్య


రేఖ (ఫైల్)

కంభం: ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో కంభం మండలం జంగంగుంట్ల గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని హాస్టల్ బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే జంగంగుంట్ల గ్రామానికి చెందిన కుర్రి పుల్లయ్య (మాజీ సైనికుడు)కు ముగ్గురు కుమార్తెలు కాగా రెండో కుమార్తె కుర్రి రేఖ (21) ఇడుపులపాయలో మెకానికల్ ఇంజినీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతోంది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో హాస్టల్ బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలిసింది. వెంటనే కళాశాల సిబ్బంది సురేఖను కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన ఇడుపులపాయ బయలు దేరి వెళ్లారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.


త్రిపురాంతకంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్ తదితరులు


టంగుటూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్


వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు

మహనీయుడు అంబేడ్కర్

ఒంగోలు/త్రిపురాంతకం/టంగుటూరు/చీమకుర్తి/ఒంగోలు సెంట్రల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. పార్టీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు పసుమర్తి గోపీచంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, వైద్య విభాగం రాష్ట్ర అధికారప్రతినిధి డాక్టర్ మాదాసు వెంకయ్య, మహిళా విభాగం జోనల్, నగర అధ్యక్షులు బడుగు ఇందిర, చింతగుంట్ల సువర్ణ, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, మేదర కార్పొరేషన్ చైర్మన్ కేతా లలిత నాంచారమ్మ, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పత్రా బంగారం, ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, పార్టీ నేతలు వల్లెపు మురళి, దుగ్గిరెడ్డి ఆంజనేయరెడ్డి, సాధం విజయలక్ష్మి, నాగూరు, మీరావలి, షేక్ జాని, రాయపాటి అంకయ్య, క్రిస్టిపాటి శేఖర్‌రెడ్డి, రావులపల్లి ధనలక్ష్మి యాదవ్, దామరాజు క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

☛ త్రిపురాంతకంలో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైపాలెం ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ శింగారెడ్డి నాగమణి పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

☛ టంగుటూరులోని బొమ్మల సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి, పూలే, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి అభ్యర్థి ఆదిమూలపు సురేష్ నివాళులర్పించారు. ఆయన వెంట ఎస్సీ నాయకులు తేళ్ల డేవిడ్, గొల్లపూడి సునీత, పేరూరి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు

చీమకుర్తి: చీమకుర్తిలోని పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహాలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేరుగు నాగార్జున ఘనంగా నివాళులర్పించారు. దేశ సమగ్రతకు అంబేడ్కర్ అందించిన సేవలను కీర్తించారు.

☛ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ కోరారు. ఒంగోలులోని హెచ్‌సీఎం కాలేజీ, ప్రకాశం భవనం సమీపంలో అంబేడ్కర్ విగ్రహాలకు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌తో కలిసి కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అంజల, డీటీసీ ఆర్ సుశీల, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, దళిత సంఘాల నాయకులు నీలం నాగేంద్ర, బిళ్లా చెన్నయ్య, చప్పిడి వెంగళ రావు, టి.ఆనంద్, బిళ్లా వసంతరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


చీమకుర్తిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ తదితరులు

జగన్ పాలనలో పేదరికం తగ్గుముఖం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేరుగు నాగార్జున

- మంత్రి మేరుగు నాగార్జున

సంతనూతలపాడు(చీమకుర్తి): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో రాష్ట్రంలో పేదరికం తగ్గుముఖం పట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, సంతనూతలపాడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేరుగు నాగార్జున పేర్కొన్నారు. ఆదివారం ఆయన పేర్నమిట్టలోని లింగారెడ్డి కళ్యాణ మండపం వద్ద విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్ అవినీతికి తావు లేకుండా రూ.2.80 లక్షల కోట్లను అర్హుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ద్వారా పేదల జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు.

ఒంటరిగా పోటీ చేసే దమ్ము బాబుకు లేదు

సీఎం వైఎస్ జగన్ 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో ఒంటరిగా బరిలోకి దిగుతుంటే, చంద్రబాబుకు అంత దమ్ములేక బీజేపీ, జనసేన పార్టీలతో జట్టు కట్టాడని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఏపీ మరో శ్రీలంక అవుతుందని, అప్పుల ఊబిలో రాష్ట్రం కూరుకుపోతోందని దుష్ప్రచారం చేసిన చంద్రబాబు.. ఇప్పుడు జగన్ కంటే సంక్షేమ పథకాలు ఎక్కువగా ఇస్తానని హామీలు గుప్పించడాన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యం కాని హామీలు గుప్పించడం చంద్రబాబుకు అలవాటేనని, ఈ దఫా కూడా అధికారం కోసం అడ్డమైన హామీలు గుప్పిస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కాడని, రుణమాఫీ పేరుతో రైతులు, డ్వాక్రా మహిళలను నిలువునా ముంచాడని దుయ్యబట్టారు. 2019 ఎన్నికల్లో అబద్ధాల చంద్రబాబును ప్రజలు ఘోరంగా ఓడించి, వాతపెట్టి ఇంట్లో కూర్చోబెట్టారని, అయినా సిగ్గు లేకుండా పదే పదే మోసపూరిత వాగ్దానాలు చేయడం బాబుకే చెల్లిందన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని గుర్తు చేశారు.

జగన్‌పై హత్యాయత్నం బాబు కుట్రే..

సీఎం వైఎస్ జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్రకు లభిస్తున్న ప్రజాదరణను ఓర్వలేక చంద్రబాబు తన వర్గీయులతో దాడి చేయించారని మంత్రి మేరుగు నాగార్జున ఆరోపించారు. గతంలో అదే విజయవాడలో వంగవీటి రంగా, పింగళి దశరథ్‌రామ్‌ను చంద్రబాబు దారుణంగా హత్య చేయించిన విషయాన్ని గుర్తుచేశారు. మంత్రి వెంట చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్, ఓబుల్ రెడ్డి మాస్టారు, వజ్రం బాబు, సుధాకర్ బాబు, పి.సుబ్బారావు, ఎ.రాంబ్రహ్మం ఉన్నారు.

వడ్డెరల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

- రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

సింగరాయకొండ(మర్రిపూడి): రాష్ట్రంలో వడ్డెర సామాజికవర్గ అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ హయాంలోనే అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని సీతారామ కళ్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వడ్డె వడ్డెర వడియరాజుల ఆత్మీయ సమావేశంలో మంత్రి సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీసీలను బ్యాక్ బోన్‌గా సీఎం జగనన్న గుర్తించారని అందుకే 131 ఉప కులాలకు 50కు పైగా కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. వడ్డెరలకు జగనన్న ఉన్నత పదవులిచ్చి గౌరవించారని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీ పదవి బీసీలకు కేటాయిస్తే వడ్డెర సామాజికవర్గానికే ఎంపీపీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని 10 వేలకు పైగా వడ్డెరల సంక్షేమానికి కృషి చేస్తానని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కొండపి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

జగనన్నను గద్దె దించాలని కుట్రలు జరుగుతున్నాయని, ఇందుకోసం భావసారూప్యత లేని పార్టీలన్నీ ఏకమయ్యాయని, వారంతా వాపు చూపి బలుపు అనుకుంటున్నారని, ఎన్ని పార్టీలు కలిసినా వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. సిద్ధం సభలకు లక్షలాదిగా అభిమానులు తరలి వస్తుంటే చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు హత్యా రాజకీయాలకు తెరలేపాయని ఆరోపించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్‌ను వడ్డెరలు ఘనంగా సత్కరించారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, పార్టీ కొండపి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రాచగర్ల పిచ్చయ్యయాదవ్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, శ్రీశైలం దేవస్థానం బోర్డు మెంబర్ తన్నీరు ధర్మరాజు, కుంచాల బ్రహ్మయ్య, జిల్లా వడ్డెర సంఘం కన్వీనర్ తన్నీరు నాగేశ్వరరావు, బెల్లంకొండ అశోక్, కె.రవి, మహిళలు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు


కేసు వివరాలు వెల్లడిస్తున్న మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు

బేస్తవారిపేట: స్నేహితురాలి వద్ద పుస్తకాలు తెచ్చుకునేందుకు వెళ్లిన బాలికకు ఓ ప్రబుద్ధుడు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం బేస్తవారిపేట పోలీస్‌స్టేషన్‌లో మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు విలేకర్ల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. పూసలపాడు ఎస్సీ కాలనీలోని చర్చి సమీపంలో ఉంటున్న స్నేహితురాలి వద్దకు పుస్తకాలు తెచ్చుకోవడానికి పదేళ్ల బాలిక వెళ్లింది. అదే సమయంలో మోతుకూరి కోల పిచ్చయ్య అనే వ్యక్తి చాక్లెట్ ఇస్తానని బాలికకు మాయమాటలు చెప్పాడు. బాలిక ఒప్పుకోకపోవడంతో బలవంతంగా తన ఇంట్లోకి లాక్కుని వెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గట్టిగ కేకలు వేయడంతో నిందితుడు భయపడి పారిపోయాడు. జరిగిన విషయాన్ని బాలిక తల్లికి చెప్పడంతో ఎస్సై నరసింహారావుకు సమాచారం అందించారు. మార్కాపురం డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. నిందితుడు కోల పిచ్చయ్యను చెట్టిచర్ల క్రాస్‌రోడ్డు సమీపంలో అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో కంభం సీఐ రామకోటయ్య, ఎస్సై నరసింహారావు పాల్గొన్నారు.

టీడీపీ కూటమిని ఛీకొట్టి.. సంక్షేమానికి జైకొట్టి..

- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీలోకి భారీగా వలసలు
- టీడీపీ, జనసేన అధినేతల తీరుపై ఆగ్రహం
- వైఎస్ జగన్‌తోనే పేదలకు న్యాయం చేకూరుతోందని స్పష్టీకరణ

కొనకనమిట్ల/ముండ్లమూరు/కురిచేడు(దొనకొండ)/సీఎస్‌పురం(పామూరు)/కంభం: టీడీపీ, జనసేన పార్టీల వ్యవహార శైలి నచ్చక, ఆ పార్టీల అధినేతలు గుప్పిస్తున్న అబద్ధపు హామీలను నమ్మలేక విసుగు చెందిన వారంతా వైఎస్సార్ సీపీ వైపు చూస్తున్నారు. జిల్లాలో టీడీపీని ఛీకొట్టి వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకూ ఊపందుకుంటోంది. ఆదివారం జిల్లా వ్యాప్తంగా వందలాది కుటుంబాలు నియోజకవర్గ అభ్యర్థుల సమక్షంలో వైఎస్సార్ సీపీ కండువాలు కప్పుకొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు జైకొట్టారు.

అన్నా సమక్షంలో 90 కుటుంబాలు

కొనకనమిట్ల మండలంలోని గార్లదిన్నె గ్రామంలో టీడీపీ నాయకులు పెంచికల కాశయ్య, చినకాశయ్య ఆధ్వర్యంలో 90 కుటుంబాలు మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నా రాంబాబు సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సానికొమ్ము వెంకటరెడ్డి, శివారెడ్డి, మల్లికార్జునరెడ్డి, మేకల శివారెడ్డి, తమ్మిశెట్టి తిరుపతయ్య, దూదేకుల మస్తాన్, దస్తగిరి, హుసేన్ సహా 75 కుటుంబాలు, అలాగే పెంచికల కాశయ్య ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణానికి చెందిన తిరుమలశెట్టి వెంకటరావు, మునగాల రవికుమార్, బొప్పరాజు సాయి, ఆకుల శ్రీనివాస్, డి.గాలెయ్య, దద్దనాల ఆంజనేయులు, రామయ్య, పసుపుల శ్రీనివాస్, కాయకాకుల శ్రీనివాస్, శివతో పాటు మరో 5 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరిని అన్నా రాంబాబు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని, రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు.


పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానిస్తున్న అన్నా


పోలవరం బీసీలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

బూచేపల్లి సమక్షంలో 50 కుటుంబాలు

ముండ్లమూరు మండలంలోని పోలవరం గ్రామంలో టీడీపీకి చెందిన 40 బీసీ కుటుంబాలవారు ముండ్లమూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్ సీపీ దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు చల్లా అంజయ్య, రాముడు, చల్లా కోటయ్య, చల్లా ఏడుకొండలు, కుంచాల వెంకటేశ్వర్లు, చిన సుబ్బారావు, చిన అంజయ్యతోపాటు మరో 35 కుటుంబాల వారికి శివప్రసాదరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలోని పులిపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ముక్కుమళ్ల సుబ్బారెడ్డి తన అనుచరులతో కలిసి దర్శి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బూచేపల్లి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

కురిచేడు మండలం గంగదొనకొండ పంచాయతీ బలిజపల్లి గ్రామానికి చెందిన యువకులు జనసేనను వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. పి.వెంకటేశ్వర్లు, జి.చిన్నవెంకటేశ్వర్లు, వి.గంగయ్య, వి.సాంబయ్య, వి.రామాంజనేయులు, కె.తిరుపతయ్య, కె.శ్రీనివాసులు, కె.ఏడుకొండలు, కె.వెంకటేశ్వర్లు, పి.వెంకట్‌కు బూచేపల్లి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో షేక్.యూసుఫ్ పాల్గొన్నారు.

దద్దాల సమక్షంలో 55 కుటుంబాలు

సీఎస్‌పురం మండలం కంభంపాడులో పార్టీ అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, సర్పంచ్ మర్రి రామయ్య ఆధ్వర్యంలో 35 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. చింతనబోయిన మాధవ, మేకల అనిల్, మేకల అజయ్, నక్కల మహేంద్ర, మేకల చిన్న అనిల్, నక్కల నాగేష్, శ్రీనివాసులు, మర్రి రామకృష్ణ, సన్నిబోయిన బాలు, మూరబోయిన బాలయ్యతోపాటు మొత్తం 35 కుటుంబాలవారు పార్టీలో చేరగా దద్దాల నారాయణయాదవ్, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్, కనిగిరి పరిశీలకులు చింతల చెరువు సత్యనారాయణరెడ్డి, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కె.అగ్రహారం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు సర్పంచ్ చీర్లదిన్నె రాధ, లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మచ్చా గోపయ్య, శ్రీరాములు, వై.పెదవెంకటసుబ్బయ్య, సీహెచ్.మౌనయ్య, చెన్ను పెదసుబ్బయ్య, చిన్నసుబ్బయ్య, అంకయ్య, మాదాల చినమాలకొండయ్య, బత్తుల గురవయ్య, చాల్లా పెదరాఘవులు, అల్లూరి ఓబయ్య, సీహెచ్.చెన్నయ్య, పాశం నారాయణ, సాదం అల్లూరయ్య టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరగా వారికి దద్దాల కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఎమ్మెల్యే కేపీ సమక్షంలో 200 కుటుంబాలు

కంభం మండలంలోని తురిమెళ్ల పంచాయతీలో ఆదివారం రాత్రి చెన్నకేశవుల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో 200 కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్ సీపి నాయకుడు చేగిరెడ్డి లింగారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ యేలం వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఎంపీటీసీ దనియాల్ ఖాసింబీ, సీఆర్‌ఐ మురళి, నాగిరెడ్డి లక్ష్మీరెడ్డి, పగడాల నాగేశ్వరరావు, ఏలం శివ, చెన్నకేశవుల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన జనసేన నాయకులతో బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి


కంభంపాడులో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దద్దాల


కె.అగ్రహారంలో కార్యకర్తలను ఆహ్వానిస్తున్న దద్దాల నారాయణ


తురిమెళ్లలో ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు